క్లుప్తంగా

ఉచిత ఇసుక పేరిట దోపిడీకి తెరలేపిన కూటమి ప్రభుత్వం

పొన్నూరు: అబద్ధపు హామీలతో ప్రజలను మోసగించి గద్దెనెక్కిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇసుక దోపిడీకి తెరలేపిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గేరా సుబ్బయ్య ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేయటం, అక్రమ కేసులు పెట్టడం ద్వారా సరికొత్త సంస్కృతికి తెరలేపారని అన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను ఏ విధంగా అమలు చేస్తారనే విధివిధానాలు ఇప్పటివరకు లేవని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు నవరత్నాల పేరుతో పథకాలను అమలు పరిచారని గుర్తు చేశారు. ఇప్పటికైనా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై చేస్తున్న దాడులను ఆపి ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాలని.. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ప్రజల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

కార్మికులకు టెండర్ విధానాన్ని రద్దు చేయాలి

చేబ్రోలు: పంచాయతీ కార్మికులకు టెండర్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ కోరారు. చేబ్రోలు మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావుకు గురువారం గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ టెండర్ పేరుతో కార్మికులను ఇబ్బందులకు గురిచేయటం సరికాదన్నారు. బలవంతపు సంతకాలు పెట్టించటం, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరించటం సరికాదన్నారు. జనాభా పెరుగుదలకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శివమ్మ, శారద, శ్రీను, హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీకృష్ణ లీలల ఆధ్యాత్మిక ప్రవచనం



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కల్యాణ మండపం వేదికపై నిర్వహిస్తున్న శ్రీమద్భాగవతం శ్రీకృష్ణలీలలు ప్రవచనం గురువారంతో ముగిసింది. తొలుత ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. మల్లాది కైలాసనాథ్ ప్రసంగిస్తూ శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని పైకెత్తి, అందర్ని దాని కింద ఉంచి కాపాడతాడని పేర్కొన్నారు. వారం రోజుల తర్వాత ఇంద్రుడు తప్పు తెలుసుకొని పశ్చాతాపడ్డాడని తెలిపారు. ప్రజలను విసిగించే వాడు అలసిపోవాల్సిందేనని, రక్షించే పరమాత్మకు అలసట ఉండదన్నారు. ప్రకృతి వైపరీత్యాలు తలెత్తినప్పుడు తమవంతు సహకారాన్ని అందించాలన్నారు.

ఆక్రమణలు తొలగించాలి



గుంటూరు మెడికల్: ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఆక్రమణదారుల పరిస్థితిపై బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ధార అంబేడ్కర్ గురువారం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఫిరంగిపురం స్టేషన్ రోడ్డులో మురుగు కాల్వలపై ఆక్రమణదారులు నివాసం ఏర్పరచుకొని కొన్ని సంవత్సరాల నుంచి స్థానికులను పలు రకాలుగా ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో పవన్ కుమార్, వీరేశం గుప్తా, దాసరి జోజప్ప, భ్రమరాంబ, అంజన ఉన్నారు.


విజేతలకు బహుమతి ప్రదానం



గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివ పేటలోని ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థినులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఆనందబాబు, డాక్టర్ శనక్కాయల ఉదయ్ శంకర్, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పావులూరి రమేష్, కార్యదర్శి కె.సతీష్, కళాశాల పూర్వ ప్రిన్సిపల్ పి. సుధాకర్‌రావు, అధ్యాపకుడు ఎస్.శరత్ పాల్గొన్నారు.

తల్లికి వందనం.. ఒక్కరికేనా..!?

- మాట మార్చిన కూటమి ప్రభుత్వం
- ఎన్నికలకు ముందు ఇంట్లో పిల్లలందరికీ అంటూ హామీ
- నేడు తల్లికి మాత్రమే రూ.15 వేలు
- ఇంటికి ఒక్కరికే అంటూ జీవో విడుదల
- చంద్రబాబు మార్క్ మోసంతో మరోసారి మోసపోయామంటున్న మహిళలు



ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామంటూ కూటమి మేనిఫెస్టోలో రెండవ హామీ (సర్కిల్లో)

పొన్నూరు: కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో మహిళలకు ఇచ్చిన హామీని నీరుగార్చే పనికి శ్రీకారం చుట్టింది. ఎన్నికలలో ఓట్ల కోసం మహిళలను మభ్యపెట్టేందుకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కింది. తల్లికి వందనంతో తమ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ప్రతి అమ్మను ఆర్థికంగా ఆదుకుంటామని చంద్రబాబు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్ సభలలో ఊదరగొట్టారు. ఎన్నికల ప్రచారంలో చెవులు దిమ్మెక్కేలా కేకలు వేశారు. కూటమి నాయకులు సైతం ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. స్కూల్‌కు వెళ్లే ప్రతి ఒక్కరికీ, ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమంది పిల్లలకు ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. హామీతో ప్రచురించిన కరపత్రాలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేసి అమ్మలకు వివరించారు. ఓట్ల కోసం అమలుకు నోచుకోని హామీలను ఇచ్చి ఫలితాల అనంతరం మోసగించిన కూటమి ప్రభుత్వంపై మహిళలు మండిపడుతున్నారు.

– మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పేరుతో ప్రతి ఏడాది తల్లుల అకౌంట్లలో రూ.15 వేలు చొప్పున జమ చేసి ఇచ్చిన మాటకు కట్టుబడి పథకాన్ని అమలు చేశారు. ఎన్నికలలో కూటమి ప్రభుత్వం ఎలాగైనా గెలవాలన్న లక్ష్యంతో ఓట్ల కోసం ముఖ్యంగా మహిళల ఓట్ల కోసం తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మీ ఇంట్లో ఒక్కరు ఉంటే రూ.15 వేలు, ఇద్దరు ఉంటే రూ.30 వేలు, ముగ్గురు ఉంటే రూ.45 వేలు, నలుగురు ఉంటే రూ.60 వేలు ఇస్తామని చెప్పి మైకులు దద్దరిల్లేలా కేకలు వేస్తూ చంద్రబాబు, లోకేశ్, పవన్‌కల్యాణ్ తల్లులకు హామీ ఇచ్చారు. కూటమి నేతల వాగ్దానాలను నమ్మిన మహిళలు ఐదేళ్ల పాటు మంచి చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని కాదని కూటమి ప్రభుత్వానికి అవకాశం కల్పించారు. కానీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండని చంద్రబాబు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని నమ్మి ఓటేశామా, రానున్న రోజుల్లో ఇంకెన్ని మోసాలు కూటమి ప్రభుత్వం చేస్తుందోనని సందేహిస్తున్నారు.

గుంటూరు రూరల్: టీడీపీ ప్రభుత్వం చంద్రబాబు పాలన మొదటి నుంచి ఏరుదాటేదాకా ఓడ మల్లన్న ఏరుదాటాక బోడి మల్లన్న అన్న చందంగా ఉంటుందని ప్రజలందరికీ తెలిసిందే. ఇదే విధంగా మరోసారి బాబు మార్క్ మోసంతో చిన్నారులను చదివించుకునే తల్లులు మోసపోయామంటూ లబోదిబోమంటున్నారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పథకాన్ని ఇంటికి ఒక్కరికి రూ.15 వేలు చొప్పున తల్లుల ఖాతాల్లో జమ చేసిన సంగతి తెలిసిందే. అదే అమ్మ ఒడి పథకాన్ని పేరు మార్చి ఎన్నికల సమయంలో చంద్రబాబు, లోకేశ్, పవన్‌కళ్యాణ్‌లు ప్రతి మీటింగ్‌లో తల్లికి వందనం పథకాన్ని ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ ఇస్తాం.. ఈ విధంగా ఇంట్లో ముగ్గురు ఉంటే ప్రతి ఏడాది ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున రూ.45 వేలు తల్లి ఖాతాలో జమ చేస్తాం అంటూ ఊదరగొట్టారు. తీరా ఎన్నికలయ్యి అధికారం చేపట్టగానే తల్లికి వందనం పథకం ఇంటికి ఒక్కరికి మాత్రమే ఇస్తాం అంటూ బాబు మార్క్ మోసపు జీవోను విడుదల చేశారు. పైగా పథకానికి అర్హత పొందాలంటే తెల్లరేషన్‌కార్డ్, విద్యార్థికి తప్పనిసరిగా 75 శాతం హాజరు.. ఇలా సవాలక్ష కారణాలను చూపుతూ మోసపు జీవోను విడుదల చేయటంతో తల్లులు మరోసారి చంద్రబాబు చేతిలో మోసపోయామని అంటున్నారు. ఇంట్లో ఇద్దరు పిల్లలుంటే రూ.30 వేలు ఏడాదికి వస్తాయని ఓటు వేస్తే నెల రోజుల్లోనే నట్టేట ముంచారని తల్లులు ఆరోపిస్తున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గం వ్యాప్తంగా మొత్తం ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో కలిపి సుమారుగా 38 వేల మంది విద్యార్థులు 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుకుంటున్నారు. ఈ క్రమంలో ఇంటికి ఒకరు, ఇద్దరు, ముగ్గురు చొప్పున విద్యాభ్యాసం చేస్తుంటారు. నియోజకవర్గం వ్యాప్తంగా 38 వేల మందికి అందాల్సిన తల్లికి వందనం సుమారు 12 వేల మందికే దక్కే అవకాశం ఉంది. వీరిలో అర్హత ప్రమాణాలు లేని వారు ఎందరో చివరికి నియోజకవర్గంలో పథకాన్ని ఎంతమంది పొందగలరోనని చిన్నారుల తల్లులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తల్లికి వందనం హామీతో మోసం

తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఉన్న పిల్లలందరికీ రూ.15 వేలు వంతున ఇస్తామంటే నమ్మి కూటమి ప్రభుత్వానికి ఓటేశాం. కానీ చంద్రబాబు మహిళలకు ఇచ్చిన హామీని నెరవేర్చలేక పోయారు. నాకు ఇద్దరు పిల్లలు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. ఇంట్లో ఎంత మంది బడికి వెళితే అంత మందికి ఒక్కొక్కరికీ రూ.15 వేలు ఇస్తామంటే ఆశ పడ్డాం. స్కూల్ ఫీజుల భారం తగ్గుతుందనుకున్నాం. కానీ కష్టాలను మళ్లీ గుర్తు చేసిన ప్రభుత్వంగా కూటమి నిలిచిపోనుంది.

– షేక్. ఖమర్జహా, పొన్నూరు, గుంటూరు జిల్లా

ఇంట్లో ఇద్దరికి ఇస్తాడని ఓటు వేశాం

మా పిల్లలు ఇద్దరు ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారు. ఎన్నికల సమయంలో ఇంట్లో ఎంతమంది ఉంటే అందరికీ రూ.15 వేల చొప్పున ఏటా తల్లికి వందనం పథకం ఇస్తామని, చంద్రబాబు, లోకేశ్, పవన్‌కళ్యాణ్‌లు ప్రతి మీటింగ్‌లో చెప్పారు. ఓటు వేయించుకుని అధికారం చేపట్టి ఇప్పుడు ఒక్కరికే ఇస్తాం అంటూ జీవోలు విడుదల చేయటం తల్లిపాలు తాగి... తల్లిని మోసం చేసినట్టే.

– టి.శ్రీలక్ష్మి, మల్లవరం గ్రామం, రూరల్ మండలం

చంద్రబాబును నమ్మి నట్టేట మునిగాం

మా పిల్లలు ఇద్దరూ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుకుంటున్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు చెప్పిన మాటలు నమ్మి అప్పటివరకూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పిల్లలను ప్రైవేటు కళాశాలలో చేర్పించాం. చంద్రబాబు ఎన్నికల్లో గెలిచేందుకు ఎన్ని అబద్ధాలైనా చెబుతాడని అందరూ అంటూ ఉంటారు. కానీ ఎన్నికల సమయంలో చెప్పిన మాటలు ఈసారైనా చేస్తాడేమో, జగన్ అన్ని పథకాలు ఇచ్చాడు... చంద్రబాబు ఇంకా ఎక్కువ ఇస్తాం అంటున్నాడు.. అని నమ్మి ఓట్లు వేశాం. ఇంట్లో చదువుకునే ప్రతి ఒక్కరికి తల్లికి వందనం ఇస్తానని చెప్పి ఇప్పుడు కేవలం ఒక్కరికి ఇస్తాం అనటం నమ్మక ద్రోహం.

–పి.మాధవి, జన్మభూమినగర్, రూరల్ మండలం

రోబోటిక్స్ రంగంలో విప్లవాత్మక మార్పులు

రోబోకప్లర్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో ప్రవీణ్ మల్లా



చేబ్రోలు: భవిష్యత్తులో రోబోటిక్స్ రంగంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయని రోబోకప్లర్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో ప్రవీణ్ మల్లా అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో రోబోట్ మాన్యుఫాక్చరింగ్ హబ్‌ను గురువారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రోబోకప్లర్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో ప్రవీణ్ మల్లా మాట్లాడుతూ విజ్ఞాన్ యూనివర్సిటీ అడ్వాన్స్‌డ్ రోబోటిక్స్ లేబొరేటరీతో మాన్యుఫాక్చరింగ్ హబ్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ రోబోట్ మాన్యుఫాక్చరింగ్ హబ్ వల్ల విద్యార్థులతో పాటు పరిశోధనా అధ్యాపకులు రోబోట్‌లను రూపొందించడం, వాటిని అభివృద్ధి చేయడం మాత్రమే కాకుండా వాటిని వాణిజ్యీకరణ కోసం మార్కెట్‌లోకి తీసుకెళ్లే అవకాశం వస్తుందన్నారు. ఇండస్ట్రీ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆవిష్కరణలను ప్రోత్సహించడంతో పాటు విద్యార్థులకు ప్రాక్టికల్‌గా మల్టీ డిసిప్లినరీ నాలెడ్జ్ అనుభవం వస్తుందన్నారు. వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుంటూరు ఈస్ట్ : వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై అరండల్ పేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శారదా కాలనీ 14వ లైనులో నివాసం ఉండే ఏల్చూరి ఏసు (30) ఆర్థిక సమస్యల కారణంగా ఈ నెల 8న ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేశాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు అతనిని జీజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెదకాకాని గ్రంథాలయంలో ప్రపంచ జనాభా దినోత్సవం


మాట్లాడుతున్న హెచ్‌ఎం ఆనందరావు

పెదకాకాని: ప్రపంచ జనాభా సమస్యలపై ఆవశ్యకత, ప్రాముఖ్యతపై అవగాహన అవసరమని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఆనందరావు అన్నారు. పెదకాకాని లూథర్‌గిరి గ్రంథాలయంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయాధికారి విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆనందరావు మాట్లాడుతూ ప్రపంచ జనాభా సమస్యలపై ఆవశ్యకత, ప్రాముఖ్యతపై దృష్టి కేంద్రీకరించటానికి ప్రతి సంవత్సరం జూలై 11వ తేదీన ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రపంచ జనాభా ప్రతి 14 సంవత్సరాలకు సుమారు 100 మిలియన్లు పెరుగుతుంది. 2011లో ప్రపంచ జనాభా 7 బిలియన్లు ఉండగా 2021కి 7.9 బిలియన్లకు చేరిందన్నారు. గ్రంథాలయాధికారి వేముల విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచ జనాభా దినోత్సవం, కుటుంబ నియంత్రణ యొక్క ప్రాముఖ్యత, లింగ సమానత్వం, పేదరికం, తల్లి ఆరోగ్యం, మానవ హక్కుల వంటి సమస్యలపై ప్రజలకు అవగాహన పెంచడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. 2024 ప్రపంచ జనాభా దినోత్సవ థీమ్ 'ఎవరిని వెనకకు వదిలేయవద్దు ప్రతి ఒక్కరిని లెక్కించండి' జనాభా గణన కీలకం.. సమగ్రమైన డేటా సేకరణపై ప్రత్యేకమైన దృష్టిని ఉంచడమేనన్నారు.

నీట్ పునఃపరీక్ష..విద్యార్థులకు శిక్ష



మాట్లాడుతున్న అసోసియేషన్ కన్వీనర్ మల్లేశ్వరరావు

లక్ష్మీపురం: నీట్ ప్రశ్న పత్రం లీక్ విషయంలో తిరిగి పరీక్ష నిర్వహించడం 23 లక్షల మంది విద్యార్థులకు శిక్ష వేయటమేనని, ప్రభుత్వం ఉదార వైఖరిని ప్రదర్శించి విద్యార్థులను మానసిక క్షోభ నుంచి రక్షించాలని పేరెంట్స్ అసోసియేషన్ కన్వీనర్ వీఎస్ఎన్ మల్లేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాయలంలో బుధవారం ఏర్పాటు చేసిన చర్చా వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నీట్ ప్రశ్న పత్రాలు లీక్ కావడంతో నష్ట పోయిన విద్యార్థులకు రీ-టెస్ట్‌కి చివరి అవకాశం ఇస్తామని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బెంచ్ వెల్లడించిందన్నారు. అయితే ఇది చివరి ఆప్షన్ మాత్రమేనని పేర్కొందన్నారు. రెండు మూడు కేంద్రాల్లో పేపర్ లీక్ అయినప్పుడు 23 లక్షల మందికి తిరిగి పరీక్ష పెట్టడం ఏ తప్పూ చేయని వారికి శిక్షేనని, దీనిపై పునరాలోచించాలనని కోరారు. పి.భావన్నారాయణ్, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి సంస్థ సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు, సంస్థ సభ్యులు మాట్లాడారు.

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సభ్యత్వం నమోదు


ఉపాధ్యాయులతో ఎన్‌టీఏ సభ్యులు

గుంటూరు ఎడ్యుకేషన్: నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం పాత గుంటూరులోని యాదవ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ ఖలీల్, ఎన్వీ జగదీష్ కుమార్ మాట్లాడుతూ నగర పరిధిలోని మున్సిపల్, ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఎన్‌టీఏ ముందంజలో ఉందన్నారు. ఉపాధ్యాయులు తమ సమస్యలను సంఘాల దృష్టికి తీసుకువస్తే, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం మంగళదాస్ నగర్, వినోభా నగర్, వాసవీ నగర్, ఎల్‌బీ నగర్, పాత గుంటూరు ప్రాంతాల్లోని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి జి.అంతోనిబాబు, అసోసియేట్ అధ్యక్షుడు వి.సతీష్‌కుమార్, నగర అధ్యక్షుడు వి. సాయి విశ్వనాథ్ పాల్గొన్నారు.

జనాభా పెరుగుదలతో ఆహార ధాన్యాల కొరత


మాట్లాడుతున్న అధ్యాపకుడు జె.వి.రావు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ వ్యాప్తంగా జనాభా పెరుగుదలతో ఆహార ధాన్యాల కొరత ఏర్పడుతోందని హిందూ కళాశాల పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు జె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. యువజన సర్వీసుల శాఖ, స్టెప్-స్వశక్తి ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సదస్సును బ్రాడీ పేటలోని మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ ఎం.బోసుబాబు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 1997 నుంచి ప్రపంచ జనాభా లెక్కింపు ప్రారంభించబడిందని, జనాభా పెరుగుదల కారణంగా ప్రభావితమవుతున్న వివిధ రంగాలు, వనరుల గురించి వివరించారు. స్టెప్ మేనేజర్ బి.రాధిక మాట్లాడుతూ జనాభా పెరుగుదలను నియంత్రించేందుకు చేపట్టాల్సిన చర్యలను తెలియజేశారు. సదస్సులో యువజన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వి. వేణుగోపాలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



గుంటూరు రూరల్: వ్యసనాలకు బానిసై ఇంట్లో వివాదాల నేపథ్యంలో వ్యక్తి మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం ప్రత్తిపాడు మండలం చిన కోంద్రుపాడు గ్రామంలో చోటు చేసుకుంది. ప్రత్తిపాడు మండలం పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ బ్రహ్మనాయుడు తెలిపిన వివరాల ప్రకారం ప్రత్తిపాడు మండలం, చినకోంద్రుపాడు గ్రామానికి చెందిన పల్లపు శ్రీనివాసరావు(38) తాపీ పని చేసుకొని జీవిస్తుంటాడు. అతనికి వట్టిచెరుకూరు మండలం యామర్రు గ్రామానికి చెందిన శ్రీలక్ష్మితో వివాహం జరగగా వారికి ఇద్దరు మగ సంతానం. శ్రీనివాసరావు మద్యానికి బానిసవ్వటంతో ఇంట్లో వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పిల్లలు పెద్దవుతున్నారు, మద్యం అలవాటు మానుకోమని భార్య హెచ్చరించింది. దీంతో ఈ నెల 10వ తేదీన గ్రామ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు, బంధువులు అతనిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రత్తిపాడు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు సమాజాన్ని చైతన్య పర్చాలి



గుంటూరు ఎడ్యుకేషన్: పర్యావరణ పరిరక్షణ దిశగా విద్యార్థులు సమాజాన్ని చైతన్య పర్చాలని శ్రీ చైతన్య విద్యా సంస్థల ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య పేర్కొన్నారు. లక్ష్మీపురంలో శ్రీచైతన్య స్కూల్ ఆధ్వర్యంలో గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ చాటుతూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ అంతరించిపోతున్న అడవుల రక్షణ, పునరుద్ధరణ, అభివృద్ధి గ్రీన్ ఇండియా మిషన్ లక్ష్యమన్నారు. ర్యాలీలో ప్రిన్సిపల్ ఎం.వినీత, కో-ఆర్డినేటర్ మూర్తి, డీన్ హరిబాబు, ఏవో శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలను స్మరించుకుందాం

తెనాలి: దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీర సైనికుల త్యాగాలను నేటి తరానికి తెలియజేయటం మనందరి బాధ్యతగా ఉపాధ్యాయ ప్రముఖుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ అన్నారు. పట్టణ చెంచుపేటకు చెందిన ఉపాధ్యాయ ఉద్యమనేత వైఎల్ నారాయణ-మీనాకుమారి దంపతుల కుమారుడు కెప్టెన్ యర్రమనేని విజయప్రసాద్ 36వ వర్ధంతిని గురువారం అదే ప్రాంతంలోని శబరి వృద్ధాలయంలో నిర్వహించారు. ఉమామహేశ్వర్ మాట్లాడుతూ విజయప్రసాద్ జీవిత విశేషాలను తెలియజేశారు. తల్లిదండ్రులు తమ బిడ్డలను డాక్టరు, ఇంజినీరు చేయాలని చూస్తున్న రోజుల్లో వైఎల్ నారాయణ దంపతులు తమ కుమారుడు విజయప్రసాద్‌ను కోరుకొండ సైనిక్‌స్కూలుకు పంపినట్టు తెలిపారు. 12వ తరగతి వరకు అక్కడ చదివాక హిమాచల్‌ప్రదేశ్‌లోని మిలటరీ క్యాంపులో చేరి, పారా కమాండర్ అయ్యారని చెప్పారు. 1987లో శ్రీలంక వెళ్లిన 'శాంతి దళం'లో సభ్యుడిగా విజయప్రసాద్ తన సేవలను అందించినట్టు తెలిపారు. 1988 జులై 11న తమిళ ఈలం టైగర్ ప్రభాకరన్ వర్గంతో పోరాటంలో విజయప్రసాద్ వీరమరణం పొందారని అన్నారు. అప్పటి నుంచి కుమారుడి వర్ధంతిరోజున తల్లిదండ్రులు సమాజసేవలో నిమగ్నమైనట్టు గుర్తుచేశారు. జి.మురహరిరావు, ఆరి ఆనందరావు, భుజంగరావు, వేజళ్ల నవ్య పాల్గొన్నారు.

సమాజ సేవలో చలపతి టెక్‌వింగ్స్ విద్యార్థులు


నిత్యావసర సరుకులు అందజేస్తున్న చలపతి విద్యార్థులు

గుంటూరు రూరల్: విద్యార్థులు చిన్ననాటి నుంచి విద్యతోపాటు సమాజ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని చలపతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. గురువారం నగర శివారులోని లాం నందున్న చలపతి ఇంజనీరింగ్ కళాశాల టెక్ వింగ్స్ అసోసియేషన్ విద్యార్థులు నగరంలోని పట్టాభిపురంలోని అనురాగ్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో వృద్ధులు, అనాథలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు ప్రతి ఏటా నిర్వహించే సమాజ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహించటం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కళాశాల సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ ఎ బాలాజి, తదితరులు టెక్‌వింగ్స్ విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి


విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంఈవో కెనడీ

అప్పాపురం(కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే ప్రతి విద్యార్థికి ప్రతి రోజు మంచి నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించాలని ఎంఈవో కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండలంలోని అప్పాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి రోజు మంచి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాలలకు సూచించిన మెనూ ప్రకారం ప్రతి రోజు విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఆయన ఆదేశించారు. ప్రతి విద్యార్థి మధ్యాహ్న భోజనం చేసే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని రుచి ఆయన చూశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షహనాజ్ బేగం, కలతోటి సాల్మన్‌రాజ్, విద్యార్థులు ఉన్నారు.

సమాజ సేవలోనూ ముందుండాలి

ఘనంగా బీ ఫార్మసీ విద్యార్థుల ఫేర్‌వెల్ డే


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న జూపూడి రంగరాజు

గుంటూరు ఎడ్యుకేషన్: బీ ఫార్మసీ పట్టభద్రులు ఔషధ రంగంతో పాటు జాతీయస్థాయిలో నిర్వహించే సివిల్స్ వంటి పోటీ పరీక్షల్లో సత్తా చాటి సమాజ సేవ చేయాలని హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గురువారం బీ ఫార్మసీ చివరి సంవత్సర విద్యార్థుల ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రంగరాజు మాట్లాడుతూ ఫార్మసీ పట్టభద్రులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం పీజీఈ సెట్, జీ ప్యాట్ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులను అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.సీతారామయ్య మాట్లాడుతూ బీ ఫార్మసీ విద్యార్థులు ఎం ఫార్మసీ చదవడం ద్వారా ఔషధ ఉత్పత్తి పరిశ్రమలతో పాటు బహుళ జాతి ఔషధ సంస్థల్లో ఉన్నతమైన ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, అధ్యాపకులు ఎస్.విజయలక్ష్మి, డాక్టర్ పి.జవహర్‌బాబు పాల్గొన్నారు.